సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 11 । ఫిబ్రవరి । 2024



మంచి పేరు తెచ్చుకోవాలి
విద్యార్థులు తమ ఆలోచనలకు పదునుపెట్టి నూతన ఆవిష్కరణలతో అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకోవాలని డీఈఓ మీనాక్షి అన్నారు. 8లో



టమాట కిలో రూ.18
కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.18 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం 37.1°/14.6°
జిల్లా అంతటా శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి కొనసాగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు

- రాష్ట్ర ఎన్నికల అధికారికి వివరించిన కలెక్టర్

పుట్టపర్తి అర్బన్: సార్వత్రిక ఎన్నికలకు జిల్లాలో పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ అరుణ్ బాబు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనాకు తెలిపారు. శనివారం ముఖేష్‌కుమార్ ఎన్నికల నిర్వహణ, సంసిద్ధత తపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జేసీ అభిషేక్‌కుమార్, డీఆర్‌ఓ కొండయ్య, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, ఆర్డీఓ భాగ్యరేఖతో కలిసి వీసీలో పాల్గొన్న కలెక్టర్.. జిల్లాలో ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించడానికి పటిష్ట ప్రణాళికలు రూపొందించామని వివరించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్‌కు, కేంద్రాల్లో మౌలిక వసతులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. భద్రతా ఏర్పాట్లపై జిల్లా ఎస్పీతో సమన్వయం చేసుకొని ఏర్పాట్లు చేస్తామన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ త్వరలోనే వెలువడనున్న దృష్ట్యా ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని మీనా సూచించారు. ఫొటో ఓటరు గుర్తింపు కార్డులు పంపిణీ త్వరగా పూర్తి చేయాలన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతం



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

లేపాక్షి: జవహర్ నవోదయ విద్యాలయలో 9, 11వ తరగతుల్లో ప్రవేశాల కోసం శనివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా సాగింది. స్థానిక జవహర్ నవోదయ విద్యాలయ, ఏపీ గురుకుల పాఠశాలలో జరిగిన పరీక్షకు 1,199 మంది విద్యార్థులు హాజరైనట్లు నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. 9వ తరగతిలో ప్రవేశానికి 1,003 మంది దరఖాస్తు చేసుకోగా, 789 మంది పరీక్షకు హాజరుకాగా, 214 మంది గైర్హాజరయ్యారన్నారు. అలాగే 11వ తరగతిలో ప్రవేశానికి 619 మంది దరఖాస్తు చేసుకోగా, 410 మంది పరీక్షకు హాజరయ్యారని, 209 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు.

'సిద్ధం' సభతో సత్తా చాటుతాం

- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: ఎన్నికల సమరశంఖారావంలో భాగంగా ఈ నెల 18వ తేదీన రాప్తాడులో నిర్వహించనున్న 'సిద్ధం' సభతో తమ సత్తా చాటుతామని పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన పుట్టపర్తిలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాయలసీమ రీజియన్ స్థాయి సిద్ధం సభకు దాదాపు 50 నియోజకవర్గాల నుంచి నాయకులు, కార్యకర్తలు లక్షలాదిగా తరలివస్తారన్నారు. పుట్టపర్తి నియోజకవర్గం నుంచి కూడా భారీగా తరలివెళ్తున్నామన్నారు. ఈ సభ తర్వాత ప్రతిపక్షాలకు కంటి మీద కునుకు ఉండదన్నారు.

ఎల్లో మీడియా వాస్తవాలు రాయాలి..
తనపై ఉన్నవీ, లేనివి కల్పించి రాస్తున్న ఎల్లో మీడియా కనీసం తన వివరణ కూడా తీసుకోవడం లేదని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మండిపడ్డారు. పుట్టపర్తిలో తన మనుషులు ఓ వ్యక్తి విగ్రహాన్ని ధ్వంసం చేశారని నిరాధార కథనాలు రాశారన్నారు. అంతలా దిగజారాల్సిన అవసరం తనకు లేదన్నారు. అలాగే తాను విజయవాడలో ఎవరినో కలిశానని కొన్ని ఛానళ్లు ప్రసారం చేశాయని, అలాంటి ఖర్మ తనకు పట్టలేదన్నారు. ప్రాణమున్నంత వరకూ వైఎస్ జగన్ వెంటే ఉంటానన్నారు. నియోజకవర్గంలోని అందరినీ కలుపుకుని రానున్న ఎన్నికల్లో పుట్టపర్తిలో వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడిస్తానన్నారు.

సేవా దృక్పథంతో పనిచేయండి





వేదికపై సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అమానుల్లా, జస్టిస్ పీకే మిశ్రా, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి, హైకోర్టు న్యాయమూర్తులు, న్యాయాధికారులు, కార్యక్రమంలో పాల్గొన్న న్యాయవాదులు, తదితరులు

- సాంకేతిక పరిజ్ఞానాన్ని వృత్తికి జోడిస్తే సత్ఫలితాలు
- యువ న్యాయవాదులకు సుప్రీం, హైకోర్టు న్యాయమూర్తుల సూచన
- బీసీఐ ఆధ్వర్యంలో జేఎన్‌టీయూలో వర్క్‌షాపు
- పలు అంశాలపై అవగాహన కల్పించిన న్యాయమూర్తులు

అనంతపురం: యువ న్యాయవాదులు సేవా దృక్పథాన్ని అలవరచుకోవాలని సుప్రీం కోర్టు, ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు హితవు పలికారు. కాలానుగుణంగా మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వృత్తికి జోడిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని సూచించారు. జేఎన్‌టీయూ (ఏ)లో శనివారం 'బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా' ఆధ్వర్యంలో యువ న్యాయవాదులకు వర్క్‌షాపు నిర్వహించారు. కార్యక్రమానికి సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆశానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాతో పాటు రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆకుల వెంకట శేష సాయి, జస్టిస్ యు. దుర్గాప్రసాద్, జస్టిస్ కే. శ్రీనివాస రెడ్డి, జస్టిస్ కే. సురేష్ రెడ్డి, డాక్టర్ కే.మన్మథ రావు, జస్టిస్ బి. శ్యామసుందర్ హాజరయ్యారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) వైస్ చైర్మన్ సి. ప్రభాకరన్, మెంబర్ ఏ.రామి రెడ్డి, ఏపీ బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు, వైస్ చైర్మన్ కే.రామ జోగేశ్వర రావు, అనంతపురం ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి జి.శ్రీనివాస్, అనంతపురం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కే. విశ్వనాథ రెడ్డి, నగర కమిషనర్ మేఘస్వరూప్, జెడ్పీ సీఈఓ నిదియా దేవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు పలు అంశాలపై యువ న్యాయవాదులకు అవగాహన కల్పించారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేష సాయి 'సివిల్ ప్రొసీజర్ కోడ్ విత్ స్పెషల్ రెఫరెన్స్ టు డిస్పోజల్ ఆఫ్ ఇంటర్‌లాక్యుటరి అప్లికేషన్స్' అనే అంశంపై ప్రసంగించారు. సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులను తాజా కేసులకు అన్వయించే విధానాన్ని వివరించారు. అనంతరం పలువురు న్యాయమూర్తులు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. సుప్రీం, హైకోర్టు న్యాయమూర్తులను బార్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ, బార్ కౌన్సిల్ ఆఫ్ అనంతపురం ఆధ్వర్యంలో గజమాలలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.

ఘన స్వాగతం..
సుప్రీం, హైకోర్టు న్యాయమూర్తులను ఆర్అండ్‌బీ అతిథి గృహంలో కలెక్టర్ గౌతమి మర్యాదపూర్వకంగాకలిశారు. పుష్పగుచ్ఛాలు, జ్ఞాపికలు అందించి స్వాగతం పలికారు. పోలీసులు గౌరవ వందనం సమర్పించారు.



జస్టిస్ అమానుల్లాకు జ్ఞాపిక అందిస్తున్న కలెక్టర్









జస్టిస్ అమానుల్లా దంపతులు, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి, జస్టిస్ పీకే మిశ్రాను సత్కరిస్తున్న బీసీఐ వైస్ చైర్మన్ ప్రభాకరన్, సభ్యుడు రామిరెడ్డి, జడ్జి శ్రీనివాస్, కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్, జెడ్పీ సీఈఓ

నైపుణ్యాలు పెంచుకోవాలి



యువ న్యాయవాదుల్లో నైపుణ్యాలు పెంపొందించడానికి వర్క్‌షాపులు దోహదపడతాయి. కాలానుగుణంగా నైపుణ్యాలు పెంపొందించుకోవాలి. న్యాయవాదులు నైతిక విలువలకు కట్టుబడి ఉండాలి. కోర్టుల్లో న్యాయమూర్తులు, సీనియర్ న్యాయవాదులు వ్యవహరించే తీరును ఆకళింపు చేసుకోవాలి. తీర్పులను నిశితంగా పరిశీలించాలి. సమాజంలో నెలకొన్న సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి. – జస్టిస్ శ్రీనివాస రెడ్డి, ఏపీ హైకోర్టు, న్యాయమూర్తి

ఓర్పుతో ఉంటేనే విజయం



న్యాయవాద వృత్తి సవాళ్లతో కూడుకున్నది. న్యాయవాదులు కోర్టుతో పాటు తమ కక్షిదారులకు జవాబుదారీగా ఉండాలి. బాగా కష్టపడుతూ, ఓర్పుగా పని చేస్తుంటేనే విజయం వరిస్తుంది. అఫిడవిట్లను రూపొందించడం, వాదనలకు సిద్ధం కావడానికి పుస్తకాలు, గత డాక్యుమెంట్లను ఎక్కువగా అధ్యయనం చేయాలి.– జస్టిస్ దుర్గాప్రసాదరావు, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి

వర్క్‌షాపు నిర్వహణ గర్వకారణం..
అనంతపురంలో యువ న్యాయవాదుల కోసం తొలిసారిగా వర్క్‌షాపు నిర్వహిస్తుండడం చాలా ఆనందంగా ఉంది. సదస్సుకు సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు హాజరు కావడం గర్వకారణం. యువ న్యాయవాదులకు తమ అనుభవాలను వివరించిన న్యాయమూర్తులకు కృతజ్ఞతలు. హాజరైన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. – ఆలూరి రామిరెడ్డి, బీసీఐ సభ్యులు

వీరభద్రుని సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు





జస్టిస్ ఆషానుద్దీన్ అమానుల్లాకు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు, ఆలయ చరిత్రను తెలుసుకుంటున్న జస్టిస్ వెంకటనారాయణభట్టి

లేపాక్షి: లేపాక్షి వీరభద్ర స్వామిని సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆషానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఎస్.వెంకటనారాయణ భట్టి దర్శించుకున్నారు. శనివారం సాయంత్రం వేర్వేరుగా ఆలయానికి విచ్చేసిన వీరికి ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ ఆధ్వర్యంలో ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తొలుత ఆలయానికి విచ్చేసిన జస్టిస్ ఆషానుద్దీన్ అమానుల్లా దుర్గాదేవి, వీరభద్రస్వామి దర్శనం చేసుకున్నారు. అనంతరం ఆలయానికి విచ్చేసిన జస్టిస్ వెంకటనారాయణ భట్టి ఆలయంలోని శిల్పాలు, చిత్రలేఖనాలను తిలకించారు. గిరిజా కల్యాణం, ఏడు శిరస్సుల నాగేంద్రుడు, చవితి వినాయకుడి విగ్రహాలు, వేలాడే స్తంభం, నాట్య మంటపం, సీతమ్మ పాదం తదితర వాటిని తిలకించి ఆశ్చర్యపోయారు. అనంతరం దుర్గాదేవి, వీరభద్రస్వామికి పూజలు నిర్వహించారు. చారిత్రక ప్రాశస్త్యం కలిగిన కట్టడాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వీరి వెంట జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, డీఎస్పీ కంజాక్షన్, అదనపు జిల్లా జడ్జి శైలజ, సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్, జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి, రూరల్ సీఐ ఈరన్న, తహసీల్దార్ బాలనరసింహులు, న్యాయవాదులు రాజశేఖర్, ప్రసాద్ రెడ్డి, సదాశివారెడ్డి, ఫణిభూషణ్ ఉన్నారు.

మాఘం.. పోటెత్తిన భక్తజనం



ఖాద్రీశుని దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కదిరి టౌన్: మాఘమాసం సందర్భంగా జిల్లాలోని ఆలయాలన్నీ భక్తులతో పోటెత్తాయి. శుక్రవారంతో అమావాస్యతో పుష్యమాసం ముగియగా, శనివారం తెల్లవారుజామునే స్నానమాచరించి స్వామివార్ల దర్శనం కోసం ఆలయాల ఎదుట బారులు తీరారు. కదిరి, హిందూపురం, పుట్టపర్తి, పెనుకొండ, మడకశిర తదితర ప్రాంతాల్లోని ఆలయాల్లో భక్తుల సందడి కనిపించింది. ముఖ్యంగా కదిరిలోని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి భక్తులు భారీగా తరలిరాగా, ఆలయ పరిసర ప్రాంతాలు కిటకిటలాడాయి. మహిళలు అధిక సంఖ్యలో హాజరై దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

జిల్లాలోని పాఠశాలలు	
ప్రభుత్వ పాఠశాలలు	341
ప్రైవేటు పాఠశాలలు	178
మొత్తం 10వ తరగతి విద్యార్థులు	22,557

- పది పరీక్షల్లో ఫలితాలపై విద్యాశాఖ ప్రత్యేక దృష్టి
- రోజుకో సబ్జెక్ట్‌పై విద్యార్థులకు స్టడీ అవర్



ఎంజీఎం పాఠశాల ఆవరణలో స్టడీ అవర్‌లో విద్యార్థులు

హిందూపురం టౌన్: పదో తరగతి పరీక్షలు త్వరలో జరగనున్న నేపథ్యంలో వంద శాతం ఉత్తీర్ణతపై విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే ప్రత్యేక ప్రణాళికతో శిక్షణ తరగతులు నిర్వహిస్తూ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తోంది. జిల్లా విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోంది. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు మార్చి 18 నుంచి ప్రారంభం కానుండగా, అప్పటి వరకూ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కొనసాగనుంది. అన్ని సబ్జెక్టులపై మంచి పట్టు సాధించేలా శిక్షణ ఇస్తున్నారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకూ రోజుకో సబ్జెక్టుపై విద్యార్థులకు ప్రత్యేక స్టడీ అవర్‌తో పాటు మరుసటి రోజు ఉదయం పరీక్ష నిర్వహిస్తున్నారు.

పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాల కల్పనపై దృష్టి..

ఇప్పటికే ఎంపిక చేసిన పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో సౌకర్యాల కల్పనపై విద్యాశాఖాధికారులు నిమగ్నమయ్యారు. ప్రతి కేంద్రంలోనూ మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యాలు, ఫర్నీచర్ తగినంతగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

10 పరీక్షల షెడ్యూల్	
తేదీ	సబ్జెక్ట్
18.03.2024	ఫస్ట్ లాంగ్వేజ్
19.03.2024	సెకెండ్ లాంగ్వేజ్
20.03.2024	ఇంగ్లీష్
22.03.2024	మ్యాథమేటిక్స్
23.03.2024	ఫిజికల్ సైన్స్
26.03.2024	బయలాజికల్ సైన్స్
27.03.2024	సోషియల్ స్టడీస్
28.03.2024	ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్ 2 / మెయిన్ లాంగ్వేజ్ పేపర్ 1
30.03.2024	మెయిన్ లాంగ్వేజ్ పేపర్ 2 / ఒకేషనల్ కోర్స్

మానసిక ఒత్తిళ్లకు లోనుకాకుండా విద్యార్థులకు ఆత్మస్థైర్యం పెంచేలా చర్యలు తీసుకున్నారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ, ప్రత్యేక శిక్షణను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షిస్తున్నారు.

ఉపయోగకరంగా మారాయి



పరీక్షలంటే గతంలో చాలా భయంగా ఉండేది. పరీక్షలు ఎలా రాయాలో ఉపాధ్యాయులు చక్కగా వివరించారు. ప్రత్యేక తరగతులు మాకెంతో ఉపయోగకరంగా మారాయి.

– ఆస్మా, పదో తరగతి విద్యార్థిని, హిందూపురం

ఒత్తిడి తగ్గింది



ప్రతి సాయంత్రం ప్రశాంత వాతావరణంలో చదివిస్తున్నారు. చదివిన ప్రతి విషయం గుర్తుండి పోయేలా ఉపాధ్యాయులు సూచనలు ఇస్తున్నారు. దీంతో పరీక్షలంటే మాలో ఉన్న భయం కాస్త దూరమైంది. పరీక్షలను ఎదుర్కొనేందుకు మానసికంగా సిద్ధమయ్యాం. పరీక్షల్లో ఏది ఇచ్చినా రాయగలమనే ధీమా వచ్చింది.

– భరత్, 10వ తరగతి విద్యార్థి, హిందూపురం

ఫస్ట్ క్లాస్‌లో పాసవుతా



గతంలో పరీక్షలంటే చాలా భయమేసేది. ఉపాధ్యాయులు చొరవ తీసుకుని ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో భయం దూరమైంది. ఆత్మస్థైర్యం పెరిగింది. చదివింది బాగా గుర్తుండిపోతోంది. ఫస్ట్‌క్లాస్‌లో పాస్ అవుతాననే నమ్మకం పెరిగింది.

– పవిత్ర, 10వ తరగతి, మడకశిర

మంచి ఫలితాలే లక్ష్యం



వెనుకబడిన విద్యార్థులు సైతం మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక శిక్షణ తరగతులు చేపట్టాం. రోజూ అదనంగా గంట పాటు స్టడీ అవర్‌ను చేపట్టి, విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నాం. వారిలో ఉన్న భయాలను పోగొట్టి ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేలా చర్యలు తీసుకున్నాం.

– మీనాక్షి, జిల్లా విద్యాశాఖాధికారి

క్లుప్తంగా

ప్రాణం తీసిన విద్యుత్ తీగ



బోయగిరి (ఫైల్)

పెనుకొండ: విద్యుత్ తీగ తగిలి తీవ్రగాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు శనివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు... పెనుకొండ పట్టణంలోని బీటీఆర్ కాలనీకి చెందిన వెంకటరాముడు, రత్నమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు సంతానం. రెండేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో పెద్ద కుమారుడు. సతీష్ మరణించాడు. ఆ షాక్ నుంచి తేరుకోక మునుపే ఆ కుటుంబంలో మరో విషాదం అలుముకుంది. చిన్న కుమారుడు బోయ గిరి (32) పది రోజుల క్రితం ఇంటి మెట్లు ఎక్కుతుండగా తీగ తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. తలకు బలమైన గాయమైంది. కర్నూలూ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో శనివారం ఆస్పత్రిలోనే మృతి చెందాడు. చెట్టంత కొడుకులు ఒకరి తర్వాత ఒకరు తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో వెంకటరాముడు దంపతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. బోయ గిరికి భార్య మీనా, ఇద్దరు కుమారులు ఉన్నారు.

వేడి రాజేసిన బీడీ

- వృద్ధుడికి తీవ్రగాయాలు



గాయపడ్డ రామాంజనేయులు

కూడేరు: బీడీ కాల్చే అలవాటు ఆ వృద్ధుడిని చిక్కుల్లోకి నెట్టింది. కాలిన బీడీని ఆర్పకుండా పడేయడంతో అది కాస్తా దుప్పటికి అంటుకుని తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. ఉదిరిపికొండకు చెందిన రామాంజనేయులు (60) శుక్రవారం రాత్రి భోజనం చేశాక మంచంపై పడుకున్నాడు. శనివారం వేకువజామున మెలకువ రావడంతో తేలచ్చాడు. మంచంపై కూర్చునే బీడీ తాగాడు. అనంతరం బీడీ ముక్కను ఆర్పకుండా పడేశాడు. ఆ ముక్క దుప్పటిపై పడిన విషయం గమనించలేదు. నిదానంగా నిప్పు రాజుకుని దుప్పటికి మంటలు వ్యాపించాయి. ఒక్కసారిగా రామాంజనేయులు కేకలు వేశాడు. అప్పటికే అతడి ఛాతీ కుడివైపు భాగం కాలి తీవ్రంగా గాయపడ్డాడు.

ప్రధానిని కలసిన ఎంపీ మాధవ్



ప్రధాని నరేంద్రమోదీతో ఎంపీ గోరంట్ల మాధవ్

హిందూపురం: పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా శనివారం ఎంపీ మాధవ్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రధాని ఎంతో ఆప్యాయంగా ఎంపీ మాధవ్‌ను పలకరించారు. గత శీతాకాల సమావేశాల్లో పార్లమెంట్‌లోకి ప్రవేశించిన దుండగులను ఎంతో చాకచక్యంగా పట్టుకున్న విషయాన్ని ప్రధాని ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఆయన 'మాధవ్ జీ గ్రేట్' అంటూ అభినందించారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



కోతులగుట్టలో ప్రజల మధ్య కూర్చున్న స్పెయిన్ దేశస్తులు

మడకశిర రూరల్: మండలంలోని కోతులగుట్ట, ఉప్పిడివల్లి గ్రామాల్లో శనివారం స్పెయిన్ బృందం సభ్యులు పర్యటించారు. ఆర్డీటీ సంస్థ కోతులగుట్టలో నూతనంగా నిర్మించిన గృహాలను సందర్శించారు. అనంతరం మొక్కలు నాటి నీరు పోశారు. మొక్కలను సంరక్షించుకోవాలని ఇళ్ల లబ్ధిదారులకు సూచించారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలన్నారు. ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజల మధ్య కూర్చొని లబ్ధిదారులతో ముచ్చటించారు. పిల్లలను బాగా చదివించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఆర్డీటీ సేవలు, పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీ మల్లికార్జున, ఏటీఎల్ సుదర్శన్‌రెడ్డి, ఆర్డీటీ సిబ్బంది పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు జడ్జీలకు ఘన స్వాగతం

పుట్టపర్తి అర్బన్: లేపాక్షి వీరభద్రస్వామి ఆలయ సందర్శనకు శనివారం విచ్చేసిన సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆషానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ వెంకటనారాయణభట్టిలకు టూరిజం గెస్ట్‌హౌస్ వద్ద ఎస్పీ మాధవరెడ్డి ఘనస్వాగతం పలికారు. పర్యటన సందర్భంగా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.





జస్టిస్ ఆషానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ నారాయణభట్టిలకు స్వాగతం పలుకుతున్న ఎస్పీ మాధవరెడ్డి

సాయి వైభవం చాటిన సంగీత విభావరి

ప్రశాంతి నిలయం: తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా సత్యసాయి భక్తులు సంగీత విభావరితో సాయివైభవం చాటారు. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన నల్గొండ భక్తులు శనివారం సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత సంగీత విభావరి నిర్వహించారు. సత్యసాయి ఆధ్యాత్మిక వైభవాన్ని, సేవాతత్వం చాటుతూ సాగిన సంగీత కచేరీతో భక్తుల మది పులకించిపోయింది. అనంతరం వారు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.




సంగీత విభావరి నిర్వహిస్తున్న భక్తులు

రైళ్ల పునరుద్ధరణ

హిందూపురం అర్బన్: శ్రీసత్యసాయి రైల్వే స్టేషన్ సమీపంలోని టన్నల్ మరమ్మతుల కారణంగా డిసెంబర్ 8వ తేదీ నుంచి రద్దయిన, దారి మళ్లించిన రైళ్లను యథావిధిగా పునరుద్ధరించినట్లు సౌత్ వెస్టర్న్ రైల్వే అధికారులు తెలిపారు. ప్రధానంగా బెంగళూరు మీదుగా జిల్లాలో ప్రవేశించే గుంతకల్లు ప్యాసింజర్‌తో పాటు కాచిగూడ, ప్రశాంతి, మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్‌లు శుక్రవారం నుంచి యథావిధిగా నడుస్తున్నాయన్నారు. అలాగే వివేక్ ఎక్స్‌ప్రెస్, అహ్మదాబాద్, రాజ్‌కోట్, అజ్మీర్, జోగ్‌పూర్, కుర్లా ఎక్స్‌ప్రెస్ రైళ్లు శనివారం నుంచి నడపుతున్నామని రైల్వే అధికారులు వెల్లడించారు.

నేడు అశ్వత్థం తిరునాల ప్రారంభం

పెద్దపప్పూరు: మాఘమాసం సందర్భంగా చిన్నపప్పూరు సమీపంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అశ్వత్థలో ఆదివారం తిరునాలు ప్రారంభం కానున్నాయి. అశ్వత్థ నారాయణస్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు పుణ్యస్నానాలాచరించడం కోసం దిగువ పెన్నాకు శనివారం చాగల్లు ప్రాజెక్టు నుంచి 500 క్యూసెక్కులు నీరు విడుదల చేశారు. తిరునాలలో తొలి ఆదివారం కావడంతో భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తున్నారు. పుణ్యస్నానాలాచరించే క్రమంలో నది లోతట్టు ప్రాంతంలోకి చిన్నారులు, దివ్యాంగులు, వృద్ధులు వెళ్లకూడదని హెచ్చెల్సీ డీఈ జయరాజ్,జేఈ హరి హెచ్చరించారు.



చాగల్లు ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేసిన దృశ్యం

అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకోవాలి



నమూనాలను తిలకిస్తున్న డీఈఓ మీనాక్షి, విద్యాశాఖ అధికారులు



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు, అధికారులు

- విద్యార్థులకు డీఈఓ మీనాక్షి పిలుపు
- ఘనంగా జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన
- వివిధ పాఠశాలల నుంచి 84 ప్రదర్శనల ఏర్పాటు
- రాష్ట్రస్థాయికి 8 నమూనాల ఎంపిక

పుట్టపర్తి అర్బన్: ఆలోచనలకు పదునుపెట్టి నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలని, తద్వారా అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారిణి మీనాక్షి విద్యార్థులకు పిలుపునిచ్చారు. శనివారం పుట్టపర్తి మండలం జగరాజుపల్లి సమీపంలోని మంగళకర ఎడ్యుకేషన్ ట్రస్ట్‌లో జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనలో జిల్లా నలుమూలల నుంచి వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు 84 ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మీనాక్షి మాట్లాడుతూ, మనిషి జీవితంలో ప్రతి మెట్టులోనూ సైన్స్ ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు. సైన్స్ లేనిదే జీవితం లేదన్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసే లక్ష్యంతో ప్రభుత్వం ఏటా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేస్తోందన్నారు. వీటి ద్వారా విద్యార్థుల్లో సైన్సుపై ఆసక్తి పెరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణల రూపకల్పనకు సహకరించాలన్నారు. మండల, నియోజక వర్గ స్థాయిలో ఉత్తమ ప్రదర్శనలను జిల్లా స్థాయికి ఎంపిక చేశామని, జిల్లా స్థాయి నుంచి 8 ప్రదర్శనలను రాష్ట్ర స్థాయికి పంపుతున్నామన్నారు. రాష్ట్ర స్థాయిలోనూ ప్రతిభ చూపి జిల్లాకు పేరుతేవాలని పిలుపునిచ్చారు.

84 ప్రదర్శనలు..

మంగళకర కళాశాలలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో మొత్తం 84 ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. వీటిని మొదట విద్యా శాఖ అధికారులు, స్టేట్ కోఆర్డినేటర్, జ్యూరీ సభ్యులు తిలకించి మార్కులు వేశారు. అధిక మార్కులు వచ్చిన 8 ప్రదర్శనలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన ప్రదర్శనలు..

పరిగి మండలం ధనాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి నిఖిల (బయో డీగ్రేడబుల్ శానిటరీ న్యాప్‌కిన్స్), పెనుకొండలోని తోటగేరె ఉన్నత పాఠశాల విద్యార్థిని చరణ్యరెడ్డి (నో లేబర్ ఫర్నేస్), కుంటిమద్ది ఉన్నత పాఠశాల విద్యార్థిని దివ్య (సోలార్ ఇన్‌సెక్టిసైడ్ స్ప్రేయర్), పేరూరు జ్యోతిరావు పూలే బీసీ వెల్ఫేర్ పాఠశాల విద్యార్థి ప్రేమ్‌కుమార్(న్యూ ఓటింగ్ మిషన్), తగరకుంట ఉన్నత పాఠశాల విద్యార్థి వంశీకుమార్ (డ్యూయల్ స్టావ్ ఫర్ కుకింగ్), కొండకమర్ల ఉన్నత పాఠశాల విద్యార్థి ఆంజనేయులు నాయక్ (ఎల్‌పీజీ గ్యాస్ లీకేజీ డిటెక్టర్), కొత్తచెరువు బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని లిఖితశ్రీ (డిజిటల్ హెల్త్ కార్డ్), సీకేపల్లి మండలం కనుముక్కల ఉన్నత పాఠశాలకు చెందిన సాకే నవ్య (ఆటోమేటిక్ వాటర్ పంపింగ్ ఇన్ అండర్ రైల్వే (బ్రిడ్జ్) ఎగ్జిబిట్లు రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో రాష్ట జ్యూరీ మెంబర్ సుబ్రత్, విద్యాశాఖ ఏడీ రామకృష్ణ, డీసీఈబీ భాస్కర్‌రెడ్డి, డీఎస్‌ఓ వెంకటరమణ, జిల్లా కోఆర్డినేటర్ వెంకటస్వామి, ఎన్‌సీఎస్‌సీ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, మంగళకర ఏఓ జయచంద్రారెడ్డి, సంస్కృతీ కళాశాల ప్రిన్సిపాల్ సెంథిల్ కుమార్, పలువురు సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శిశు సంరక్షణ కేంద్రం ప్రారంభం

ప్రశాంతి నిలయం: కేరళలో వరద ప్రభావిత ప్రాంతం చెర్తాలలో పిల్లల సంరక్షణ కోసం సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ నిధులతో నిర్మించిన శిశు సంరక్షణ కేంద్రాన్ని మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె. రత్నాకర్ రాజు శనివారం ప్రారంభించారు. 2018లో కేరళలో సంభవించిన వరదల కారణంగా 14 జిల్లాల్లో ప్రజల ఆస్తులతో పాటు ప్రభుత్వ పాఠశాల భవనాలు వంటి నిర్మాణాలు పునరుద్ధరించలేని విధంగా ధ్వంసమయ్యాయి. అయితే ఈ ప్రాంతాల్లో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ అక్కడి ప్రజలకు సేవలు అందించే కార్యక్రమంలో భాగంగా పునరుద్ధరణ కార్యక్రమాలు చేపట్టింది. వరద ప్రభావిత ప్రాంతాలైన చెర్యాల, చెట్టికులంగర, తామరాకుళం, చెంగన్నూరు, మన్నార్, పున్నప్రా, కందల్లూరు, మరారికుళంలలో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ రూ.1.5 కోట్ల వ్యయంతో 9 శిశు సంరక్షణ కేంద్రాలను నూతనంగా నిర్మించింది. సుమారు 400 చదరపు అడుగుల విస్థీర్ణంతో 16 మంది పిల్లల ఉండేలా నిర్మించారు. ఈ కేంద్రాల ద్వారా సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ 3 – 5 సంవత్సరాల పిల్లలకు అల్పాహారం, భోజనం, చిరుతిండ్లు, పౌష్టికాహారం అందిస్తూ వారి సంరక్షణకు పాటుపడుతోంది. ఆదివారం మరో 8 శిశుసంరక్షణ కేంద్రాలను ఆయన ప్రాంభించనున్నారు. ఈ కార్యక్రమాలలో ఆయనతో పాటు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యుడు మనోహర్ శెట్టి, కేరళ సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



శిశు సంరక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె. రత్నాకర్ రాజు